

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 56 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ఆకాశానికి తాకుతున్న బంగారు శిఖరాలతో గంభీరంగా కనిపిస్తున్నది మహారాజ ప్రాసాదం. ప్రభువుల ఉద్యానవనంలో జాలిగా తలలూపుతున్నట్లు కదులుతున్నాయి వృక్షశాఖలు. చెట్ల మధ్యనుండి మౌనంగా చూస్తున్న యోగిలా కనిపిస్తున్నది మహారాజసౌధం. ఉద్యానవనం మధ్యలో చంద్రకాంతశిలలు పరిచిన విశాలమైన వేదిక కనిపిస్తున్నది. వేదిక మధ్యలో విశాలంగా పేర్చిన చందన దారుమయమైన చితి కనిపిస్తున్నది. ఎత్తైన ఆ చితిని ఎక్కడానికి బంగారపు మెట్ల పీఠం ఉన్నది.

నిలువెత్తునా పేర్చిన చందనపు దుంగలు నానిపోయేలా తడుపుతూ వరదలుగా పారుతున్నది ఆవునెయ్యి. అటు పక్కన పెద్ద పెద్ద బంగారపు పాత్రలలో క్షరిగించిన ఆవు నేయి వున్నది. ఒక్కొక్క పాత్రను బలిష్టులైన భటులు

నలుగురు మోసుకొచ్చి వేదిక మీదవున్న భటులకు అందిస్తున్నారు. వారు ఆ నేతిని చందనపు దుంగలమీద ఒంపుతున్నారు. ఒక పక్కన బంగారు పాత్రలు నిండుకుంటున్నాయి. మరొకపక్క

అంతఃపురం వెనుకనున్న వంటశాలనుండి నేయి నింపిన బంగారు పాత్రలను కండలు తిరిగిన భటులు మోసుకొస్తున్నారు. మరిగిన ఆవునెయ్యి వాసన మంచి చందనపు వాసనతో కలిసి పరిమళాల అలలు చెలరేగుతున్నాయి. ఆ పరిమళం ఆ ఉద్యానవనాన్ని, ఆ రాజ ప్రాసాదాన్ని, అంతఃపురాన్ని, ధారానగరం మొత్తాన్ని నింపుతున్నది.

ధారానగరం! కాళిదాసకవనధారానగరం! భోజరాజ దానధారానగరం! కవిశుండాల కావ్యదానధారానగరం! పాఠకుడా! ఉలికిపడ్డావా? భ్రమపడ్డానేమో అనుకుంటున్నావా? నీవు నిజమే విన్నావు. నేను నిజమే అన్నాను. రెండువేల ఐదువందలసంవత్సరాల క్రితం ఆ దృశ్యం నేను కన్నాను. నేను అప్పుడూ వున్నాను. అంతకుముందూ వున్నాను. ఇంకా అనంత కాలం వుంటాను. నేను కాలప్రవాహాన్ని. నేను గంగను. నేను కృష్ణను. నేను నిరంతర జీవప్రవాహాన్ని. జీవనదీప్రవాహాన్ని! నేను సర్వాన్ని! కదిలేవి, కదలనివి, ప్రాణులు, ప్రాణరహితాలు అన్నీ నేనే! అన్నీ నా విభూతులే! నమ్మికతో ఉన్నావా, సత్యాన్ని పొడగన్నావా, అనంత కాలరహస్యాలను విన్నావా నువ్వు అదృష్టవంతుడివి!

ఆ సత్యాన్ని తానూ చూస్తున్నాడు భాస్కర రాయలు. కాశీపండితులకు గంగానదిపై ఆకాశంలో అమ్మవారిని ప్రత్యక్షంగా సాక్షాత్కరింపజేసిన మహామహోపాసకుడు భాస్కరరాయలు. ఆయన దివ్యద్రష్ట. మహామంత్రస్రష్ట. ఆయనకు అభిముఖులై కూర్చుని ఉన్నారు లక్ష్మీధరుడు, అక్కుభొట్లు. అష్టదళపద్మంగా వేసిన ముగ్గుల మధ్య అర్ధనిమీలిత నేత్రులై పద్మాసనంలో కూర్చుని వున్నారు. ఎనిమిదేసి రేకుల మంత్రమయమైన పద్మాలు రెండు. ఒక్కొక్క రేకులో ఒక్కొక్క బీజాక్షరం వ్రాయబడి ఉన్నది. పూవుమధ్యలోని దుద్దుమీద మరొక బీజాక్షరం. దానిమీద మంత్రమయమైన దర్భలు పరిచి, వాటిమీద జింకచర్మం పరిచి, దానిమీద వారిని కూర్చొనబెట్టాడు భాస్కరరాయలవారు.

ఒక నిర్ణీతమైన విశిష్టమైన రోజున, ప్రత్యేకమైన తిథి, వారము, నక్షత్రం కలిసిన రోజున మంత్రపూర్వకంగా గ్రహింపబడిన సమిధలు అవి. తూర్పుకు కొసలు ఉండేట్లుగా పరిచిన ఆ దర్భాసనం మీద వారికి శక్తిపాతం చేశాడు భాస్కరరాయలవారు. ఆ క్షణం నుండి వారికి శరీరస్పృహలేదు. తమలో తాము తొంగి చూస్తున్నట్లుగా అర్ధ నిమీలిత నేత్రాలతో రెండున్నరవేలసంవత్సరాల గతకాలపు దృశ్యాలను చూస్తున్నారు. భాస్కరరాయల వారికి గతము, వర్తమానము రెండూ స్పృహలో వున్నాయి. ఋగ్వేదంలోని ఒక ఉపనిషత్తులోని మంత్రాన్ని హవనం చేశాడు ఆయన. అంతకుమునుపు ఆ మంత్రద్రష్టయైన ఋషిని, 'దీర్ఘతమ ఔచథ్యుడిని' ఆవాహన చేశాడు. మానసికంగా తనను తాను రెండుగా

విభజించుకున్నాడు. ఒకే కొమ్మమీద కూర్చున్న రెండు పక్షులలా ఒకే దేహాన్ని ఉపాధిగా చేసుకునిరెండు ఆత్మలుగా భూత, వర్తమానకాలాలను చూస్తున్నాడు.

ఉరుకులు పరుగులమీద వందల సంఖ్యలో అక్కడకు ప్రవాహంలా చేరుకుంటున్నారు ధారానగర పౌరులు.అన్నివయసుల వాళ్ళూ వున్నారు. స్త్రీలు, పురుషులు, బాల బాలికలు ఉన్నారు. తలపాగాలు, శిరస్త్రాణాలు, వస్త్రాలు, ఆభరణాలు చూస్తుంటే సంపన్నులు, సామాన్యులు అందరూ కనిపిస్తున్నారు. విచ్చుకత్తులు, బల్లెములు ధరించిన రాజభటులు సామాన్య పౌరులను, జానపదులను కట్టడి చేయడానికి విఫలప్రయత్నాలు చేస్తున్నారు. గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నారు స్త్రీలు. ఆర్తనాదాలు చేస్తున్నారు పురుషులు. తల్లిదండ్రులను చుట్టుకుని బావురుమని కన్నీరు మున్నీరవుతున్నారు పసివాళ్ళు.

అల్లంతదూరంనుండీ అంతకంతకూ దగ్గరవుతున్న మంగళ వాయిద్యముల ఘోష వినిపిస్తున్నది. పౌరుల కలకలం పెరిగింది. యిప్పుడు మంగళ వాయిద్యములతోబాటుగా బిగ్గరగా వేదమంత్ర ఘోష వినిపిస్తున్నది.భుజములమీద చందన పేటికను మోస్తూ భటులు సమీపిస్తున్నారు. వారికి ఒకప్రక్కన మంగళ వాయిద్యములను మ్రోగిస్తూ ఆస్థాన కళాకారులు వస్తున్నారు. మరొక ప్రక్కన కలశములను ధరించిన వేదపండితులు మంత్రోచ్చారణ చేస్తూ కదిలి వస్తున్నారు.

పట్టువస్త్రాలతో, నేలకు తాకుతున్నయ్యా అన్నట్టు వేళ్ళాడుతున్న పూలమాలలతో అలంకరింపబడి ఉన్నది భటుల భుజాలమీద ఉన్న చందనపేటిక. ఆ పేటికకు ముందు భాగంలో చేతులు జోడించి, కదిలివస్తున్న మేరుపర్వతంలా ఉన్నాడు ఆజానుబాహుడు. పట్టు పీతాంబరములు, భూమికి తాకుతున్న నిండైన పూల మాలలు ధరించి ఉన్నాడు. భుజములమీదకు వాలుతున్న అందమైన నల్లని శిరోజాలతో, ఇనుప గుదియలలా ఉన్న భుజాలతో ఉన్నాడు. ఈ లోకంతో సంబంధం లేనివాడిలా నిర్వికారంగా ఉన్నాడు. నీలిమేఘం కమ్ముకున్న నిండు జాబిల్లిలా ఉన్నాడు. జంటబాసి, దిగులుగా గంభీరంగా నడిచి వస్తున్న సింహంలా వున్నాడు. ఆయన ధారానగర చక్రవర్తి భోజుడు.

ఆయన ప్రక్కన మేలిముసుగులో మెరుపుతీగలా ఉన్న స్త్రీమూర్తి ఆయన ధర్మపత్ని, ధారానగర పట్టపురాణి లీలావతి. వారికి ముందు కృపాణ ధారులైన భటులు వందమంది కదిలివస్తున్న శిల్పాలలా కవాతు చేస్తూ వస్తున్నారు. చందనపేటికకు వెనుకగా మరొక వందమంది భటులు ఆయుధధారులై అనుసరిస్తున్నారు. వారి వెనుక కాళ్ళూ చేతులూ

గొలుసులతో కట్టివేసిన ఒక స్త్రీని తీసుకువస్తున్నారు పదిమంది భటులు. ఆమె ముందు ఎండిపోయిన నెత్తుటి మరకలతో వున్న వేటకత్తిని ఒక పళ్ళెంలో పట్టుకుని నడుస్తున్నాడు ఒక భటుడు.

ఆ ఊరేగింపు కంటబడగానే కోలాహలం ఎక్కువైంది. మహారాజా! ప్రభూ! అని ఆర్తనాదాలు చెవులు చిల్లులు పడేలా చెలరేగుతున్నాయి. 'అమ్మా! మహారాణీ! అని స్త్రీల శోకరావాలు మిన్నుముట్టాయి. వేదికకు సమీపంలో పేటికను కిందికి దించారు భటులు. పూల మాలలూ వస్త్రాలూ తొలిగించి పేటికను తెరిచి పక్కకు తప్పుకున్నారు. మహారాజు ధర్మపత్నితో ముందుకు నడిచి పేటికను సమీపించాడు.

పేటిక లోపలికి చూసి 'మహాకవీ' అని కొన్ని నిముషాలు బిగ్గరగా రోదించాడు. నీరంతా వర్షించిన మేఘంలా తేలికబడ్డాడు. మహారాణి కెవ్వున కేకవేసి శోకంలో మునిగిపోయింది. ప్రజా సమూహం చేసిన రోదనలతో ధారానగరం మారుమ్రోగింది.

మహారాజు ప్రజలవైపు తిరిగి రెండడుగులు ముందుకు వేశాడు. శాంతించండి అన్నట్టు చేతులు జోడించి వెనుకకు తిరిగాడు. ప్రజల రోద అణిగిపోయింది. పురోహితుల బృందంలోని నలుగురు యువకులు ముందుకు వచ్చి పేటికను సమీపించారు. పేటికలోనుండి ఒక మృతదేహాన్ని బయటకు తీసి భుజాలమీద మోస్తూ ముందుకు నడిచారు. భయంతో, గగురుపాటుతో కూడిన కేకలు ఎగిసిపడ్డాయి. పురోహితుల భుజాలమీది మృతదేహానికి తల లేదు. మెడవరకు నరకబడిన మొండెం నల్లగా గడ్డకట్టిన రక్తపు చారికలతో భీతావహంగా ఉన్నది.

మరొక పురోహితుడు ముందుకు వచ్చి పేటికలోనుండి పట్టువస్త్రం పరచిన బరువైన బంగారు పళ్లాన్ని కంపిస్తున్న చేతులతో బయటకు తీశాడు. ప్రజలు భయంతో చేసిన హాహాకారాలు నిట్టూర్పులతో రాజసౌధం కంపించిపోయింది. మహారాణి అనుసరిస్తుండగా ముందుకు నడిచాడు భోజమహారాజు. ప్రదక్షిణగా ప్రజాసమూహానికి, నిశ్చేష్టులై చూస్తున్న ఆస్థాన కవి పండిత గాయక కళాకారులకు రాజగురువులకు నమస్కరించాడు. మహారాణి భర్తను అనుకరించింది. పురోహితుడి చేతిలోని పళ్లాన్ని తన చేతులలోకి తీసుకున్నాడు భోజమహారాజు.

ఆ పళ్ళెరంలో సగం మెడవరకూ ఉన్న తల ఉన్నది. ముకుళించిన నల్లకలువలలా ఉన్నాయి శాశ్వతంగా మూసిన విశాలమైన కనులు. శ్రావణ మేఘాలు కమ్ముకున్న పున్నమి చంద్రుడిలా వున్నది నల్లని కురులతో యింకా

కళకళలాడుతున్న ముఖం. ఆ ముఖంలో ఇప్పటికీ ఒక దివ్యతేజస్సు కనిపిస్తున్నది. ఆ ముఖం పొరపాటున రాహువు శిరస్సుకు బదులుగా శ్రీహరి ఖండించిన శీతాంశుడి శిరస్సులా ఉన్నది.

అది కాళిని కనులారా కన్న శిరస్సు! అది కవికులశిరోమణి యైన మహాకవి శిరస్సు. అది 'నీవే నేను' అని వాణి ప్రకటించిన కవికులగురువు శిరస్సు. అది ఉపమానానికి అతడే అనిపించుకున్న అనుపమానుడైన కవి శిరస్సు. అది మహాకవులందరినీ అనామకులను చేసిన సార్ధకనామకుడైన మహాకవి కాళిదాసు శిరస్సు.

ఒక్కసారిగా ఆ అలౌకికమైన స్థితిలో కూడా నిలువునా చలించిపోయాడు లక్ష్మీధరుడు. ఆ ముఖం అచ్చు తన ముఖంలా కనిపించింది. మరు నిముషంలో ఆ ముఖం తన పితామహుడు మహామహోపాసకుడు లక్ష్మీధరపండితుని ముఖంలా కనిపించింది. 'వేంకటేశా! జమలాపురీశా!' అని అప్రయత్నంగా నామస్మరణ చేస్తూ కంపించిపోయాడు అక్కుభొట్లు. కనులు తెరిచి వారిద్దరినీ ప్రశాంతంగా చూశాడు భాస్కరరాయలవారు. ఆయనకు ఆశ్చర్యమేమీ కలుగలేదు.

వారిప్పుడు చూసి కలవరపడుతున్న ముఖాన్ని రెండురోజుల క్రితమే స్వప్నంలో చూశాడు ఆయన. కలలో కాళికాలయంలో ఖండింపబడిన శిరస్సును రెండున్నరవేల సంవత్సరాల క్రితం భోజచక్రవర్తి బంగారు పళ్ళెరంలో మోసిన శిరస్సుగా ఆయన గుర్తించాడు. ఆ ముఖమే విజయనగర చక్రవర్తుల పెనుగొండ రాజసౌధంలో తైలవర్ణచిత్రంలో కనిపించింది. ఆ ముఖమే ముమ్మూర్తులా తనకెదురుగా ధ్యానావస్థలో కూర్చున్న నవయువకుడు లక్ష్మీధరుడి ముఖాన్ని పోలి ఉన్నది! పాఠకుడా! విస్మయపడకు! కాలసాగరంలో వీచికలు అన్నీ ఒకే తత్త్వం! కొన్ని చిరువీచికలు, కొన్ని పెనువీచికలు, అంతే తేడా!

మహాకవులు విలపిస్తున్నారు. ప్రజానీకమంతా రోదిస్తూ మొరలుపెడుతున్నది. మహారాజా! కనికరించండి! ప్రభూ ఆగిపోండి! అని దీనమైన పలుకులు వినిపిస్తున్నాయి. కరకు కత్తులు ధరించిన మొండి సైనికుల కనులుకూడా నిండుచెరువులవుతున్నాయి. కొన్ని గొంతుకలు వేదమంత్రాలు పఠిస్తూ రుద్ధమై ఆగినప్పుడు మరికొన్ని గొంతులు అందుకుంటున్నాయి. తలలేని మొండాన్ని కన్నీళ్ళతో తడుపుతూ జాగ్రత్తగా చితి మీదకు చేర్చారు వాహకులు. గొల్లున రోదిస్తూ పక్కకు తప్పుకున్నారు. వేదమంత్రాల ఘోష, వాయిద్యాల రొద, చూస్తున్నవారి రోదనలతో దారానగరం దద్దరిల్లిపోతున్నది.

కాళిదాసకవి శిరస్సును ఉంచిన బంగారు పళ్లెరాన్ని గుండెకు హత్తుకుని ప్రశాంతంగా ముందుకు నడిచాడు భోజమహారాజు. ప్రశాంతంగా చితిని ఎక్కాడు. మృతకళేబరం మొండానికి శిరస్సును అతికించినట్లుగా శిరసు ఉంచిన పళ్లెరాన్ని ఉంచాడు. ప్రక్కనే పద్మాసనంలో ధ్యానభంగిమలో కూర్చున్నాడు. ఆయన పక్కన అలాగే మహారాణి కూర్చున్నది. ముమ్మారు ఓంకార నాదాన్ని సంధానంచేసి కనులు మూసుకున్నారు రాజదంపతులు. చితికి నిప్పు అంటించారు రాజగురువు. గుండెలు బ్రద్దలయ్యే శోకనాదాలు మిన్ను, మన్ను ఏకం చేశాయి.

ఫెళ ఫెళార్భాటాలతో ఏడేడు నాలుకలు సాచి ఎగిసిపడుతున్నాయి అగ్నిజ్వాలలు. బంగారపు రేకులు తాపడంచేసిన కోట బురుజులు మంటలవెలుగులో మళ్ళీ మళ్ళీ కాలుతున్న బంగారపు కలశాలలా ఉన్నాయి. ఉద్యానవనంలోని చెట్లు, ఆకులు, కొలను, శిలాప్రతిమలు బంగారు కాంతులతో మెరిసిపోతున్నాయి. శిలలై చూస్తున్న పురప్రముఖులు, కవి పండిత గాయక కళాకారులు ఆకాశానికి అంటుతున్న మంటల వెలుగులో కదలని బంగారు శిల్పాలలా మెరిసిపోతున్నారు.

ఘడియలో నడుమెత్తున బూడిదకుప్ప మిగిలింది. అంతకుముందు కొన్ని క్షణాల క్రితం మూడు దివ్య రూపాలు వెనుదిరిగి చూడకుండా ఆకాశమార్గంలో ప్రకాశిస్తూ వెళ్లడాన్ని చూశారు భాస్కరరాయలవారు, అక్కుభొట్లు, లక్ష్మీధరుడు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS